క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుడివాడరూరల్: ఏపీ ట్రాన్స్‌కో 220కేవీ నున్న–గుడివాడ ట్రాన్స్మిషన్ లైన్ బేలు ఆధునీకరణలో భాగంగా సాంకేతిక మరమ్మతులు చేయాల్సిన క్రమంలో 220కేవీ విద్యుత్ ఉపకేంద్రం గుడివాడలో ఒక సర్క్యూట్ విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేసినట్లు ఏపీ ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.కోటేశ్వరరావు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే మరమ్మతులు పనులు చేపట్టామని.. ఈనెల 25వ తేదీ వరకు ఉదయం 6గంటల నుంచి సాయంత్రం 7గంటల వరకు పనులు జరుగుతాయన్నారు. దీని వల్ల 220కేవీ గుడివాడ, 132కేవీ పామర్రు, 132కేవీ మచిలీపట్నం, 132కేవీ అవనిగడ్డ, 132కేవీ చిగురుకోట ఉపకేంద్రాలు, ఆయా ప్రాంతాల ప్రజలకు సరఫరాలో అంతరాయం కలుగుతుందని, దీన్ని ప్రజలు గమనించి తమకు సహకరించాలని ఆయన కోరారు.

ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకోండి



గుడివాడరూరల్: నియోజకవర్గంలోని రైతులకు ఎరువులు కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే రాము వ్యవసాయశాఖ అధికారులకు సూచించారు. ఏలూరురోడ్డులోని టీడీపీ కార్యాలయంలో గురువారం వ్యవసాయశాఖ అధికారులతో సమావేశం నిర్వహించి ఎరువుల స్టాక్ రికార్డును పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు కావాల్సిన ఎరువులను సకాలంలో అందిస్తామన్నారు. సమావేశంలో వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, గుడివాడ, గుడ్లవల్లేరు మార్కెట్ యార్డ్‌ల చైర్మన్‌లు చాట్రగడ్డ రవికుమార్, పొట్లూరి రవి, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌లకు త్రీమెన్ కమిటీల నియామకం

పమిడిముక్కల: మండలంలోని పలు పీఏసీఎస్‌లకు ప్రభుత్వం త్రీమెన్ కమిటీలను నియమించింది. హనుమంతపురం పీఏసీఎస్ చైర్మన్‌గా రాజులపాటి రామాంజనేయప్రసాద్, అగినపర్రు పీఏసీఎస్ చైర్మన్‌గా సీహెచ్ కమలాకరరావు, అమీనపురం పీఏసీఎస్ చైర్మన్‌గా కరిమికొండ రవీంద్రబాబు, గోపువానిపాలెం పీఏసీఎస్ చైర్మన్‌గా యార్లగడ్డ పిచ్చేశ్వరరావు, కపిలేశ్వరపురం పీఏసీఎస్ చైర్మన్‌గా తాతినేని బాబూరావు, మేడూరు పీఏసీఎస్ చైర్మన్‌గా గోపిశెట్టి మోహనరావు, పమిడిముక్కల పీఏసీఎస్ చైర్మన్‌గా మైనేని వెంకట నరేంద్రను నియమించారు. నూతన కమిటీలను టీడీపీ మండల అధ్యక్షుడు రాజులపాటి శ్రీనివాసరావు, కృష్ణాపురం డీసీ చైర్మన్ నాదెళ్ల సుబ్రహ్మణ్యం అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు మాంటిస్సోరి విద్యార్థులు



గుడివాడ టౌన్: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు తమ విద్యార్థులు ఎంపికై నట్లు మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు జి. పద్మావతి గురువారం తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన ఎంపికలో అండర్ – 22 విభాగంలో బాలుర జట్టుకు ఎన్. బెనర్జీ, ఎ. శివ, జి. రాకేష్, బాలికల విభాగంలో ఎం. జైబున్నీసా ఎంపికైనట్లు ఆమె తెలిపారు. పోటీలకు ఎంపికైన విద్యార్థులు వ్యాయామ ఉపాధ్యాయులు జి. శ్రీనివాసరావు, ఎం. అణ్వేష్‌లను పాఠశాల యాజమాన్యం అభినందించింది.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

గుడివాడ టౌన్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల న్యాయ సేవాధికార కమిటీ గుడివాడ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. స్థానిక ఎస్‌పీఎస్ మున్సిపల్ హైస్కూల్, జీఆర్‌కే టౌన్ హైస్కూల్ విద్యార్థులకు ఈ పోటీలు జరిగాయి. మీడియేషన్ ఫర్ ద నేషన్ (జాతి కోసం మధ్యవర్తిత్వం) అనే అంశంపై ఈ పోటీలు జరిగాయి. 11వ అదనపు జిల్లా జడ్జి జి. సుబ్రహ్మణ్యం ఆదేశాల మేరకు ఈ పోటీలు నిర్వహించినట్లు కోర్టు సిబ్బంది తెలిపారు. విజేతలైన విద్యార్థులకు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, డీఎస్ శ్రీనివాస్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

రవీంద్రనాథ్ ఠాగూర్‌కు ఘన నివాళి



పమిడిముక్కల: అగినపర్రు శాఖ గ్రంథాలయంలో గురువారం రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతిని ఘనంగా జరిపారు. గ్రంథపాలకులు కూనపరెడ్డి సుబ్రహ్మణ్యం, గ్రామపెద్దలు బొబ్బా కృష్ణారావు, మల్లి ఠాగూర్ చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు.

సమస్యలు పునరావృతం కాకూడదు

రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్ రెడ్డి



ఎన్టీఆర్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలోని రికార్డులు పరిశీలిస్తున్న ఆహార కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్ రెడ్డి

పామర్రు(మొవ్వ): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ సీహెచ్ విజయ ప్రతాప్ రెడ్డి గురువారం పామర్రు మండలంలో పలు ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. నియోజకవర్గ కేంద్రం పామర్రులోని వెనుకబడిన తరగతుల బాలికల వసతి గృహం, నిమ్మకూరులోని నందమూరి లక్ష్మయ్య వెంకట్రావమ్మ గురుకుల విద్య పాఠశాల, కళాశాల వసతిగృహం, పామర్రు మండలం ఎన్టీఆర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం, కంచర్లవానిపురం అంగన్‌వాడీ కేంద్రం, జుజ్జువరం ప్రైమరీ స్కూల్లో భోజన వసతులు, పామర్రు గ్రామంలో యడ్ల అప్పారావు నిర్వహిస్తున్న ఉచిత రేషన్ పంపిణీ కేంద్రాన్ని సందర్శించారు. ఆయా వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి వారికి అందుతున్న భోజన వసతులపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సూచించిన అల్పాహారంలో మార్పులు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

• నిమ్మకూరు గురుకుల పాఠశాలలో నెలకు 35 క్వింటాళ్ల బియ్యం సరఫరా చేయాల్సి ఉండగా, ఒకేసారి 120 క్వింటాళ్ల బియ్యం సరఫరా చేయడంతో నిల్వ బియ్యానికి పురుగులు పట్టి పాడైపోతున్నట్లు చైర్మన్ దృష్టికి తీసుకురాగా, సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్య పునరావృతం కాకుండా చూడాలని, అదేవిధంగా విద్యార్థులకు చిక్కి సరఫరా కావడం లేదని తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

నిబంధనలు పాటించాలి..

అనంతరం విజయప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం వారంలో మూడు రోజులు చికెన్, ఆరు రోజులు గుడ్డు భోజనంలో విద్యార్థులకు అందించాల్సి ఉందని, అదేవిధంగా సాయంత్రం స్నాక్స్, ఉదయం పాలు, రాత్రి ఫ్రూట్స్ అందించేలా కమిషన్ పర్యవేక్షిస్తుందని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అంగన్‌వాడీ కేంద్రాలపై సంతృప్తి..

మండలంలో పలు అంగన్‌డీ కేంద్రాలలో పిల్లల హాజరు రిజిస్టర్లు, గర్భిణులు, బాలింతల పౌష్టికాహార తదితర రికార్డులు, నిల్వ స్టాకు క్షుణ్ణంగా పరిశీలించి తనిఖీ చేశారు. పిల్లల కోసం వండిన ఆహారాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా పౌర సరఫరాల అధికారి జి. మోహన్ రావు, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి జి. రమేష్, ఏపీ ఆర్‌జేసీ కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీ కుమారి, ఆయా వసతి గృహాల వార్డెన్లు శివలక్ష్మి, నాగాంజనేయులు, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు ఎస్. విజయ్ కుమారి, ఎం. సత్య శ్రీ, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు చైర్మన్ వెంట ఉన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్‌కు అభినందన



ఉప్పాల హారికను సత్కరిస్తున్న విక్టర్, ఎంపీపీ, జెడ్పీటీసీలు

గుడివాడరూరల్: జెడ్పీ చైర్మన్ ఉప్పాల హారిక వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించడం హర్షణీయమని వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మట్టా జాన్ విక్టర్ అన్నారు. గురువారం ఉప్పాల హారికను ఆమె స్వగృహంలో గుడివాడ, నందివాడ ఎంపీపీలు గద్దే పుష్పరాణి, పెయ్యల ఆదాం, జెడ్పీటీసీ సభ్యులు గోళ్ల రామకృష్ణ, కందుల దుర్గాకుమారి, నందివాడ మండల వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కందుల నాగరాజులతో కలసి వెళ్లి పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విక్టర్ మాట్లాడుతూ జెడ్పీ చైర్మన్‌గా హారిక జిల్లా అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. అదే విధంగా ఐదు జిల్లాలు కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియామకం కావడం ఆనందంగా ఉందన్నారు. ఆయా జిల్లాలో పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని విక్టర్ కోరారు.

లారీ యజమానులు నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న డీఎస్పీ ధీరజ్ వినీల్

గుడివాడరూరల్: లారీల యజమానులు ట్రాఫిక్ నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని డీఎస్పీ వి.ధీరజ్ వినీల్ అన్నారు. బొమ్ములూరు లారీ స్టాండ్‌లో లారీ ఓనర్లు, డ్రైవర్ల అసోసియేషన్ నాయకులతో గురువారం డీఎస్పీ సమావేశాన్ని నిర్వహించారు. వాణిజ్య వాహనాల చట్టబద్ధ వినియోగం, భద్రత ప్రమాణాలపై అవగాహన కల్పించారు. లారీల యజమానులు తమ తమ లారీలకు రిజిస్ట్రేషన్‌తో పాటు డ్రైవర్లకు లైసెన్స్, ఫిట్నెస్, పర్మిట్, పొల్యూషన్, బీమా వంటి డాక్యుమెంట్లు తప్పనిసరిగా కలిగి ఉండాలని సూచించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ లారీలు నడిపే సమయంలో డ్రైవర్లు మద్యం, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. అదే విధంగా పట్టణంలో లారీలను ఎక్కడబడితే అక్కడ పార్కింగ్ చేయకుండా లారీ స్టాండ్‌లోనే నిలుపుదల చేయాలని సూచించారు. వాహనాల్లో జీపీఎస్, రిఫ్లెక్టర్‌లు, బుకింగ్ వివరాలు, డ్రైవర్ ఐడీ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. సమావేశంలో తాలూకా, టూటౌన్ సీఐలు ఎస్‌ఎల్‌ఆర్ సోమేశ్వరరావు, హనీష్, లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన తల్లిపాల వారోత్సవాలు



సదస్సులో మాట్లాడుతున్న విజయా ఫ్లారెన్స్



యాకమూరులో అవగాహన కల్పిస్తున్న మరియమ్మ

గుడివాడ టౌన్: తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. 16వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో సెక్టార్–1 పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన బాలింతలు, గర్భిణులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సీడీపీఓ ఎ. విజయా ఫ్లారెన్స్ మాట్లాడుతూ బిడ్డకు కనీసం 6 నెలలు వచ్చే వరకు తల్లి పాలు ఇవ్వాలన్నారు. బిడ్డకు పాలు ఇవ్వడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెలకువలు వివరించారు. బాలింతలు మంచి పౌష్టికాహారం తీసుకున్నప్పుడే బిడ్డకు కావలసినన్ని పాలు ఇవ్వగలుగుతారని తెలిపారు. కావున మంచి ఆహారం తీసుకుని ఆరోగ్యమైన బిడ్డలను సమాజానికి అందించాలని ఆమె కోరారు. సూపర్‌వైజర్‌లు బీకేడీ భవానీ, ఎ. జయంతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

యాకమూరులో..

తోట్లవల్లూరు: యాకమూరు దళితవాడలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లి పాల వారోత్సవం గురువారం జరిగింది. తల్లి పాల విశిష్టత గురించి అంగన్‌వాడీ కార్యకర్త మరియమ్మ తల్లులు, గర్భిణులకు అవగాహన కల్పించారు. తల్లి పాలు బిడ్డకు ఎంతో శ్రేష్ఠకరమని, బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగించాలని ఆమె తెలియజేశారు. ఎంఎస్‌కే శివలీల, ఎంఎల్‌హెచ్‌పీ పూర్ణ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు ఆరోగ్యం..

వెంట్రప్రగడ (పెదపారుపూడి): పుట్టిన బిడ్డకు గంటలోపు తల్లి పాలు తాగిస్తే ఆరోగ్యవంతంగా ఉంటారని వెంట్రప్రగడ సెక్టార్ సూపర్ వైజర్ ఎం. శివనాగమణి అన్నారు. మండలంలోని వెంట్రప్రగడ అంగన్‌వాడీ–3 కేంద్రంలో గురువారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ తల్లి పాలు బిడ్డలు మంచి ఆరోగ్యవంతులు ఉండటం జరుగుతుందన్నారు. తల్లి పాల ప్రాముఖ్యతను వివరించారు. సమావేశంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోవాలి

గుడివాడ టౌన్: స్థానిక ఏఎన్నార్ కళాశాలలో కెరీర్ గైడ్‌లైన్స్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో కార్పొరేట్ రంగాలలో ఉద్యోగ అవకాశాలు అనే అంశంపై అవగాహన సదస్సు గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి కోల్‌కతాకు చెందిన ఐసీఏఐ ప్రతినిధి డాక్టర్ వివేక్ రాజశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగాలతో పోలిస్తే కార్పొరేట్ రంగంలోని ఉద్యోగాలకు ఎన్నో ఆర్థిక ప్రయోజనాలు ఉంటాయన్నారు. వాటిపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యార్థి దశ నుంచే నైపుణ్యాన్ని పెంపొందించుకునేలా వివిధ అంశాలలో పోటీపడాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ పీజీఎస్ కుమార్, కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ బీఎస్ఎస్ పద్మజ, ఎంబీఏ హెచ్‌ఓడీ ఎంబీ సువర్చల, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

మండవల్లి: విద్యాదానం మహాదానం అని ఎంఈఓ డి. రామారావు అన్నారు. పెరికెగూడెం హైస్కూల్‌లో గురువారం వెన్నార్ సిరామిక్స్ కంపెనీ లిమిటెడ్ అందించిన 1,500 పుస్తకాలను ఆయన ఎంఈఓ–2 రత్నసునాదంతో కలిసి విద్యార్థులకు పంపిణీ చేశారు. ఏటా విద్యార్థులను ప్రోత్సహిస్తూ విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న వెన్నార్ యాజమాన్యానికి రత్నసునాదం కృతజ్ఞతలు తెలియజేశారు. వెన్నార్ సిరామిక్స్ జనరల్ మేనేజర్ ఎస్. అమర్నాథ్, హెఆర్–ఏజీఎం వి. శ్రీనివాస్, హెచ్ఎం దుర్గాప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిచ్చిమొక్కలు తొలగించాలి



మండవల్లి: తక్కెళ్లపాడులోని తాగునీటి చెరువులకు నీరందించే పంట కాలువలో పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగి నీటిని కలుషితం చేస్తున్నాయి. ఈ కాలువ ద్వారా నుచ్చుమిల్లి, పులపర్రు తదితర గ్రామాల్లోని మంచినీటి చెరువులకు నీరు చేరుతోంది. కాలువలో తూడు, నాచు తదితర పిచ్చిమొక్కలు దట్టంగా పెరగడంతో నీరు కలుషితమయ్యే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కాలువను శుభ్రం చేసి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

నేడు ఆలయ పునర్నిర్మాణానికి భూమిపూజ

ముదినేపల్లి రూరల్: మండలంలోని వణుదుర్రు శివారు కొత్తపల్లిలో ఆంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పూజా కార్యక్రమానికి పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో పలువురికి ఉద్యోగాలు



ఎంపికైన అభ్యర్థులతో కంపెనీ ప్రతినిధులు, కళాశాల ప్రిన్సిపాల్

గుడివాడ టౌన్: స్థానిక వీకేఆర్, వీఎన్‌బీ అండ్ ఏజీకే ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం క్యాంపస్ ఎంపికలు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ ఎస్‌హెచ్‌వీ ప్రసాదరావు తెలిపారు. ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ అయిన పైతాక్స్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో ఈ ఎంపికలు జరిగాయన్నారు. కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ తదితర విభాగాలలో జరిగిన ఈ ఎంపికలో మొత్తం 145 మంది పాల్గొనగా కంప్యూటర్ విభాగంలో 8, ఎలక్ట్రానిక్స్‌లో ఒకరు, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌లో ఒకరు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఎంపికైన అభ్యర్థులను కళాశాల కరస్పాండెంట్ వి. కోదండరామయ్య, డైరెక్టర్ కల్యాణ్ కుమార్ అభినందించారు. కంపెనీ ఎండీ తరుణ్‌కుమార్, రోహిత్, షేక్ మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో అధ్యాపకుల నిరసన



కైకలూరు ప్రభుత్వ డిగ్రీ కాలేజీ వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న అధ్యాపకులు

కైకలూరు: డిగ్రీ కళాశాలల్లో సాధారణ బదిలీలను ప్రభుత్వం వెంటనే చేపట్టాలని కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ అధ్యాపకులు నల్లబ్యాడ్జీలతో కాలేజీ ప్రవేశ ద్వారం వద్ద గురువారం నిరసన తెలిపారు. గవర్నమెంట్ కాలేజీ టీచర్స్ అసోషియేషన్(జీసీటీఏ), గవర్నమెంట్ కాలేజీ గెజిటెడ్ టీచర్స్ అసోషియేషన్(జీసీజీటీఏ) పిలుపు మేరకు నినాదాలు చేశారు. జీసీటీఏ ఏలూరు జిల్లా యూనిట్ కార్యదర్శి డాక్టర్ ఎం.విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం జీవో నంబరు 42ను రద్దు చేయాలన్నారు. బోధన చేస్తున్న వారిని అధ్యాపకులుగా కాకుండా సీనియారిటీ ప్రకారం ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా వ్యవహరించాలన్నారు. యూజీసీ నిబంధనల మేరకు కెరియర్ అడ్వాన్స్‌మెంట్ స్కీం(సీఏఎస్) ప్రతి 6 నెలలకు నిర్వహించకపోవడంతో అనేక మంది నష్టపోతున్నారన్నారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీలతకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్(ఏబీఆర్ఎస్ఎం) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ ఎం.హరిప్రసాద్, జీసీటీఏ యూనిట్ ప్రెసిడెంట్ డాక్టర్ అడపా కేదారి, అధ్యాపకులు పాల్గొన్నారు.

• **లీగల్ గార్డియన్ షిప్ ధ్రువపత్రం మంజూరు**

ఏలూరు (టూటౌన్): మానసిక వైకల్యం కలిగిన దివ్యాంగురాలికి లీగల్ గార్డియన్‌షిప్ ధ్రువపత్రం మంజూరు చేసినట్లు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.రామ్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మానసిక వైకల్యంతో బాధపడుతున్న కైకలూరుకు చెందిన కుమారి కున్‌దీప్‌నకు లీగల్ గార్డియన్‌గా దీప్ యుధిష్ఠరును నిర్ణయిస్తూ గురువారం కలెక్టర్ వెట్రిసెల్వి ధ్రువీకరణ పత్రం మంజూరు చేసినట్లు పేర్కొన్నారు.

• **ఆలయ పాలకవర్గం ఏర్పాటుకు నోటిఫికేషన్**

ముదినేపల్లి రూరల్: మండలంలోని ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ పాలకవర్గ ఏర్పాటుకు గురువారం దేవదాయ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. 2023 నవంబరులో ఈ ఆలయ పాలకవర్గ పదవీకాలం ముగియగా, అప్పటి నుంచి నూతన పాలకవర్గాన్ని ఏర్పాటు చేయలేదు. తొమ్మిది మంది సభ్యులతో పాలకవర్గ ఏర్పాటుకు దేవదాయ శాఖ నోటిఫికేషన్ జారీ చేసిందని సహాయ కమిషనర్ ఆర్.గంగాశ్రీదేవి తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు 20 రోజుల లోపు దరఖాస్తులు అందించాలని సూచించారు.

గుర్రపుడెక్క తొలగింపు పనులు ప్రారంభం



దేవపూడి వద్ద గుర్రపుడెక్క తొలగింపు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కామినేని

ముదినేపల్లి రూరల్: మండలంలోని దేవపూడి బ్రిడ్జి వద్ద గుర్రపుడెక్క తొలగింపు పనులను ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రెయిన్ల మరమ్మతుల్లో భాగంగా కొన్ని డ్రెయిన్లలో పేరుకుపోయిన గుర్రపుడెక్కను తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అనంతరం పెదపాలపర్రు రైతుల కోరిక మేరకు గ్రామానికి వెళ్లి స్థానిక సొసైటీని పరిశీలించి సొసైటీకి ఎరువులు సక్రమంగా రాకపోవడాన్ని గుర్తించారు. ఎరువుల కొరత వల్ల ఇబ్బందులు పడుతున్నట్లు రైతులు ఎమ్మెల్యేకు తెలియజేయగా జేసీతో ఫోన్లో మాట్లాడి ఎరువుల సమస్యను పరిష్కరించాలని కోరారు.

గుడివాడ–కంకిపాడు రోడ్డుపై గవర్నర్‌కు వినతి



గవర్నర్‌కు పంపుతున్న పోస్ట్ కార్డులను మీడియాకు ప్రదర్శిస్తున్న భద్రతాదళం సభ్యులు

గుడివాడ టౌన్: గుడివాడ–కంకిపాడు రోడ్డులో మిగిలిన నాలుగు కిలోమీటర్ల మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలని భవిష్యత్ భద్రతాదళం కన్వీనర్ వైవీ మురళీకృష్ణ కోరారు. ఈ రోడ్డు అస్తవ్యస్తంగా ఉండటం కారణంగా అనేక మంది ప్రాణాలు కోల్పోయారని, గాయాలపాలయ్యారని ఆయన అన్నారు. రోడ్డు మరమ్మతులు పూర్తయ్యే వరకు భారీ వాహనాల ప్రయాణం రద్దు చేయాలని మృతి చెందిన వారి కుటుంబాలకు, గాయపడిన వారికి నష్ట పరిహారం చెల్లించాలని కోరుతూ ప్రజల నుంచి సేకరించిన పోస్ట్ కార్డు విన్నపాలను గురువారం గవర్నర్‌కు పంపుతున్నట్లు ఆయన తెలిపారు. భద్రతాదళం సభ్యులు మహ్మద్ తెహర్ బాషా, జి. పూర్ణచంద్రరావు, సయ్యద్ నజీర్ పాల్గొన్నారు.

జోనల్ స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



అండర్-22 విభాగంలో ఎంపికైన క్రీడాకారులు



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసాద్

గుడివాడ టౌన్: స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో కృష్ణా జిల్లా క్రీడా సాధికార సంస్థ నిర్వహించిన జోనల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక జరిగింది. అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, కబడ్డీ, ఖో–ఖో, వాలీబాల్ క్రీడలకు సంబంధించిన క్రీడాకారులను ఇక్కడ ఎంపిక చేశారు. అండర్–22 విభాగంలో వీరు ఈనెల 11 నుంచి 14 వరకు గుంటూరులో నిర్వహించే జోనల్ పోటీలలో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

కేకేఆర్ గౌతమ్ విద్యార్థులు..

తమ విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించి జోనల్ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని డాక్టర్ కేకేఆర్ గౌతమ్ స్కూల్ ప్రిన్సిపాల్ పి. లక్ష్మీప్రసాద్ గురువారం తెలిపారు. అండర్–22 రాష్ట్ర స్థాయి పోటీలకు తమ విద్యార్థులు ఎ. జనవికర్ష, ఎన్. తేజస్వి వరలిక, జి. గుణవర్షిణి, డి. ఆరాధ్య, కె. నిష్ఠ ఎంపికయ్యారని ఆయన తెలిపారు. ఎంపికై న విద్యార్థులను, కోచ్ ఎం.సత్యాన్వేష్‌లను పాఠశాల ప్రిన్సిపాల్స్ ఎం. సత్యారామ్, జ్యోతి, ప్రశాంతి అభినందించారు.

ఘనంగా చేనేత కార్మిక దినోత్సవం

కాజ(మొవ్వ): మొవ్వ మండలంలోని కాజలో గురువారం జాతీయ చేనేత కార్మిక దినోత్సవాన్ని నిర్వహించారు. కృష్ణాజిల్లా చేనేత కార్మిక సంఘ అధ్యక్షుడు కోదాటి నారాయణరావు నాయకత్వంలో చేనేత కార్మికులు తమ సమస్యలపై నినాదాలు చేస్తూ ప్రదర్శనగా తరలి వెళ్లి సెంటర్లోని మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూల దండలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. చేనేత కార్మికులు చిరందాస్ సత్యనారాయణ, నందం శ్రీనివాసరావు, కోదాటి సుధాకర్, కోదాటి కనకదుర్గారావు, పంచల మోహనరావు పాల్గొన్నారు.

• **సరుకులను సకాలంలో అందించండి**

కైకలూరు: రేషన్ సరుకులను దుకాణాలకు సకాలంలో రవాణా చేయాలని ఏలూరు ఆర్డీవో అచ్యుత అంబారీష్ చెప్పారు. కైకలూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఎంఎల్ఎస్ పాయింట్‌ను ఆయన గురువారం తనిఖీ చేశారు. సబ్ కాంట్రాక్టర్‌కు రవాణాపై పలు సూచనలు చెప్పారు. బియ్యం, పంచదార నిల్వలు, తూకం పరిశీలించారు. అనంతరం కైకలూరు, ఆటపాక గ్రామాల్లో జీవో నంబరు 30 ద్వారా స్థలాల క్రమబద్ధీకరణకు 10 దరఖాస్తులు ఇటీవల అందాయి. వీటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఆటపాకలో జాతీయ రహదారి విస్తరణ పనుల పరిధిలోకి కొన్ని స్థలాలు వచ్చినట్లు గుర్తించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం, ఆర్ఐ వెంకటేశ్వరరావు, ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జి బందా చంద్రశేఖర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

• **పాఠశాలకు వాటర్ ప్యూరిఫైర్ అందజేత**

తోట్లవల్లూరు: వాటర్ ప్యూరిఫైర్‌ను విద్యార్థులు, ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని రోటరీక్లబ్ ఆఫ్ ఉయ్యూరు అధ్యక్షుడు చొప్పరపు నాగ సుబ్రహ్మణ్యం సూచించారు. స్థానిక మండల పరిషత్ పాఠశాలకు దాత మర్రెడ్డి ప్రసాదరెడ్డి ఆర్థికసాయంతో రూ.15,000 విలువైన వాటర్ ప్యూరిఫైర్‌ను క్లబ్ ఆధ్వర్యాన నాగ సుబ్రహ్మణ్యం గురువారం ఉపాధ్యాయులకు అందజేశారు. విద్యార్థులకు క్లబ్ ఆధ్వర్యాన కంటి, దంత పరీక్షలు నిర్వహించటంతోపాటు పాఠశాల ఆవరణలో రోటరీ ప్రతినిధులు మొక్కలు నాటారు. రోటరీ కార్యదర్శి అమీర్ మీర్జా, కేసీపీ మేనేజర్ కోటిరెడ్డి, విద్యా కమిటీ చైర్మన్ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.